కథ

# నువ్వెవరు???


కురువ చంద్రశేఖర్

"నువ్వెవరు....?"

నేనొక రాజకీయ నాయకుడ్ని. మంత్రి పదవిలో వున్నవాడ్ని, ప్రజలకు మాటల్లో అర చేతిలో స్వర్గం చూపించి, చేతల్లో నరకాన్ని చవి చూపించే చేవగలవాడ్ని. ఈ పదవిలోకి రావడానికి ఎంత ఖర్చు పెట్టానో అంతకు వెయ్యింతలు సంపాదించే సత్తా వున్నవాడ్ని. నన్నడ్డుకునే వాడే లేడు ఈ రాష్ట్రంలో. నేనే మొనగాడ్ని, మొలతాడు లేనివాణ్ణి. అడ్డుకున్నవాణ్ణి అధికారంతో అంతం చేసేస్తా, జాగ్రత్త! ప్రజలకి ఐదేళ్ళకోసారే కనపడే వాడ్ని, ఈ లోపల నన్ను చూడాలంటే ఏదైనా ప్రారంభోత్సవం చేయించండి నాతో, అక్కడ కనపడ్తా! చాలా నా గురించి...

ఇంకా చెప్పమంటావా?

చెబితే నీవు తట్టుకోలేవు.



నేను నువ్వెవరు అని అడిగానుగాని నీవొక రాజకీయనాయకుడివైతే నాకేంటి. ప్రజల్ని నరకాసురుడిలా నమిలేస్తే నాకేంటి?

అసలు నువ్వెవరు?

నేనొక పోలీసు అధికార్ని. రాజకీయ నాయకులు ఇప్పుడుంటారు రేపుపోతారు. కానీ నేను మాత్రం ఎప్పటికీ మీ వెంటే వుంటాను. అందుకే నాతో జాగ్రత్తగా వుండండి. పిచ్చి పిచ్చి వేసాలేయకండి, బుద్ధిగా వుండండి లేకపోతే ఎక్కడ పడితే అక్కడ పట్టుకొని ఫైన్ లేస్తా. హెల్మెటుందా....లైసెన్స్ వుందా...పొల్యూషన్ సర్టిఫికెట్ వుందా, బండికి ఇన్స్యూరెన్స్ వుందా అన్నీవున్నా నెంబర్ ప్లేట్ సరిగా లేదు, ఫైన్‌కి డబ్బులున్నాయా...? వుంటే ఎవ్వరు చూడకుండా పబ్లిగ్గా నా చేతిలో పెట్టండి...చలానా...అక్కర్లేదు,

అదికావాలంటే ఇంకో ఐదు వందలున్నాయా...వుంటే చలానడుగు. ఏంటి, రాంగ్ పార్కింగ్ చేసి ఇంకా మాట్లాడతావు. పార్కింగ్‌కి స్థలమేదా...అది మా డ్యూటి కాదు బల్దియాది, పోయి వారినే అడుగు పార్కింగ్ ఎక్కడ చేయాలని? ఏంటి ఇంకా మాట్లాడుతున్నావు. కె.పి.హెచ్.బి లో, లకడీకాపూల్లో, అమీర్‌పేటలో పెద్ద పెద్ద టూరిస్టు బస్సులు వాళ్ళిష్ట మొచ్చినట్లు రోడ్ల మీద అడ్డంగా పెట్టి ట్రాఫిక్ జాంలు చేస్తున్నారని వారికి ఫైన్ వేయమంటావా. వారు పెద్ద పెద్ద సారు వాళ్లు. ఆ టూరిస్టు బస్సులు ఎవరివనుకుంటన్నవు. మంత్రులది, ఎంపీలది... అదంతా మా పెద్ద పెద్ద సార్లు చూసుకుంటారు.

నేను నువ్వెవరు అని అడిగాను కాని నీవు పోలీసు ఆఫీసర్‌వైతే నాకేంటి...ఫైన్ లేస్తే నాకేంటి. అసలు నువ్వెవరు?

నేనొక బల్దియా అధికార్ని. ఏంటి మీ ఏరియాలో డ్రైనేజ్ నాలాలకి మ్యాన్ హోల్స్ లేవా? లేకపోతే నన్నేంచేయమంటావు... ఏమంటున్నావు, చిన్న పిల్లలు అందులో పడి చనిపోతున్నారా? అయితే నన్నేంచేయమంటావు. అసలు మూతలు లేనివాటి దగ్గరికి పిల్లల్ని ఎవరు వెళ్ళమన్నారు. ఏమిటి మేమే పూడిక తీసి మూతపెట్టకుండా వదిలేసామా....? అవునయ్యా వదిలేసాం, ఇప్పుడు ఏమంటావు. కంప్లైంట్ చేస్తావా, చేసుకో... ఏమీ జరగదు. కంప్లైంట్ ఇచ్చినందుకు మిగతావాటి మూతలు కూడ రేపు కనబడవు, జాగ్రత్త. నేను నువ్వెవరు అని అడిగాను కాని నీవు బల్దియా అధికారివైతే నాకేంటి, డ్రైనేజ్ మ్యాన్ హోల్స్ మీద మూతలు తీసేస్తే నాకేంటి...అసలు నువ్వెవరు?

నేనొక టౌన్ ప్లానింగ్ అధికార్ని. ఏంటి! ఇల్లు కట్టుకోడానికి పర్మిషన్ కావాలా. అయితే సాయంత్రం ఆఫీసు అయిపోయిన తరువాత బయట నన్నొకసారి కలువు. ఈ లోపల ప్యూన్ని కలువు. అతను ఎంత ఖర్చువుతుందో చెపుతాడు. ఆ తరువాత నన్నుకలుసుకో. ఏంటి! అటువంటివి నీ కిష్టం లేదా. అయితే నీకెవరు పర్మిషన్ ఇస్తారో నేనూ చూస్తా? ఏంటి! పర్మిషన్ లేకుండా కడతావా. ఇల్లీగల్ కన్‌స్ట్రక్షన్ అని వెంటనే కూల్చేస్తా! ఏంటి..? రోడ్లమధ్యకి కట్టిన షాపింగ్ కాంప్లెక్స్‌లు ఎందుకు కూల్చానంటావా? అవి ఇల్లీగలే అంటావా, అవునయ్యా ఇల్లీగలే. అయితే ఏంటి..? ఎవరికి పర్మిషన్ ఇవ్వాలో, ఎవరికి ఇవ్వకూడదో మాకు బాగా తెలుసు. ఎవరిది కూల్చేయాలో మాకు బాగా తెలుసు.

అయినా వారి మూలనే కదా మా ఇంట్లో లక్షల లక్షల కట్టలు వచ్చిపడ్తుంటాయి. నేనేమైనా పిచ్చోడ్నా లక్షలొచ్చే కాంప్లెక్స్‌లని కూల్చడానికి... పోపోవయ్యా పెద్ద చెప్పొచ్చాడు.

నేను నువ్వెవరు అని అడిగాను కానీ నవ్వు టౌన్ ప్లానింగ్ అధికారివైతే నాకేంటి, లక్షలు మేస్తే నాకేంటి అసలు నువ్వెవరు?

నేనొక కాంట్రాక్టర్‌ని. ఏంటి! నాసి రకం సిమెంటు వుయోగించి రోడ్లు, బ్రిడ్జులు కడుతున్నాం. అవి తొందరగా పగుళ్ళిస్తున్నాయా... పగిలిపోని మాకేంటి? మా డబ్బులు మాకొచ్చాయి. ఆఫీసర్లకి వాళ్ళ కమీషన్ వాళ్లకి ముట్టచెప్పాం. అన్ని విధాల మా అందరికి లాభం వచ్చింది. బ్రిడ్జులు కూలిపోతే కూలిపోనీ, కొన్నాళ్ళు పత్రికల్లో వేస్తారు, తరువాత కమిటీ అంటారు, ఆ తరువాత అందరూ మరిచిపోతారు.

నేను నువ్వెవరని అడిగాను కాని, నీవు కాంట్రాక్టర్‌వైతే నాకేంటి? నాసి రకం సిమెంట్‌తో రోడ్లు, బ్రిడ్జులు కట్టి డబ్బులు మింగితే నాకేంటి. అసలు నువ్వెవరు?

నేనొక గవర్నమెంట్ హాస్పటల్లో డాక్టర్ని... ఏమిటి! సీరియస్ కేసా? అయితే బయట నిలబడు. పిలిచినప్పుడురా! అప్పుడు చూస్తా. ఎంత సేపవుతుందా? ఏమో చెప్పలేం, ఒక గంట పట్టొచ్చు. ఒక రోజుకూడ పట్టొచ్చు. అంత వరకు ప్రాణం వుంటుందా? అని అడుగుతున్నావా? అది ఆపైవాణ్ణడుగు. అయినా గవర్నమెంట్ ఆస్పత్రికి వచ్చి ప్రాణం వుంటుందా? అని అడిగే వాడ్ని నిన్నొక్కడ్నే చూస్తున్నా. ఆ! నీకేంటి, కుక్క కరచిందా. కరిస్తే నేనేంచేస్తాను. కుక్కకాటుకి చెప్పుదెబ్బ అన్నారు, పోయి చెప్పుతో కొట్టుకో, అదేపోతుంది? లేదా కుక్కాసుపత్రికిపో మందేస్తారు. ఏమంటున్నావు? కార్పోరేట్ ఆసుపత్రికి పోతావా...పోపో...అక్కడ అవసరం లేకపోయినా అరవై టెస్టులు రాస్తారు. ముక్కు నొప్పికి మూడు లక్షలు ముక్కుపిండి మరీ వసూలు చేస్తారు. ఏం బెదిరిస్తున్నావా? అయినా స్టాఫ్ లేక, ఫండ్స్ లేక మేం ఏడుస్తుంటే మధ్యలో నీ గోలేంటి? వెళ్ళవయ్యా వెళ్లు.


నేను నువ్వెవరు అని అడిగాను కాని నీవు డాక్టర్‌వైతే నాకేంటి? పేషంట్‌ని చూడక పోతే నాకేంటి? రోగి చస్తే నాకేంటి? అసలు నువ్వెవరు?

నేనొక మెడికల్ అండ్ ఇంజనీరింగ్ కాలేజీ ఓనర్ని. ఏంటి! మెడికల్‌సీటు కావాలా? ఓ ఏబయి కొట్టు వెంటనే ఇచ్చేస్తా. ఏబయి అంటే ఏబయి రూపాయలు కావు బాబు, ఏబయి లక్షలు కొట్టు. ఏంటి కొంచెం మార్కులు తక్కువొచ్చినందుకు ఏబయి లక్షలు పెట్టాలా? అని అడుగుతున్నావా?

మరి నేను కాలేజీ పెట్టిందెందుకు? నీలాంటి స్టూడెంటుకివ్వడానికి కాదు. మనీ వున్న స్టూడెంట్‌కి ఇవ్వడానికి మాత్రమే. నీ దగ్గర మనీ వుంటే సీటు కొనుక్కో. ఏంటి! కమర్షియల్ అయిపోయామా మరేంచేస్తాం. గవర్నమెంట్, మేము, అందరం బ్రతకాలిగా. మనీ ఇచ్చి సీటు పుచ్చుకో లేదా చదువుకి గుడ్ బై చెప్పేయి...అంతే కాని నన్ను విసిగించకు వెళ్ళు.

నీవు కాలేజీ ఓనర్‌వైతే నాకేంటి? లక్షలు తీసుకొని మెడికల్ సీటిస్తే నాకేంటి? అసలు నువ్వెవరు?

నేనొక రౌడి షీటర్ని..నాతోటి ఎప్పుడూ నాకు



తోడుగా రాంపురిగాని, రివాల్వర్ గాని వుంటుంది. ఈ రోజుల్లో నాకందరూ మిత్రులే. ఎందుకంటే ప్రతీ ఒక్కరికి నాతోటి అవసరం వుంటుంది. కిడ్నాప్ చెయ్యాలన్నా, ల్యాండ్ కబ్జా చెయ్యాలన్నా, చేసి దాన్ని కాపాడు కోవాలన్నా, ఎలక్షన్లలో దొంగ వోట్లు వెయ్యాలన్నా, వేసే వారిని బెదిరించాలన్నా, అంతెందుకు, బ్యాంకులు కూడ నన్ను వారి లోన్ రికవర్ చేసుకోవడానికి వుపయోగించుకుంటున్నారు. మన భారత దేశం ఇంతగా డెవలప్ అవుతుందని నేనెప్పుడు అనుకోలేదు. టెక్నాలజీతో పాటే నాలాంటి మంచివారికి కూడ ఆదరణ పెరుగుతుంది. అందుకే నేనిప్పుడు సమాజంలో ఒక ఇంపార్టెంట్ పర్సన్‌ని... ఏమంటున్నావు! నేను చెడ్డవాడ్నా? ఏది ఇంకోసారి అను, నిన్ను నిలువునా నరకేస్తా.

నేను నువ్వెవరు అని అడిగాను గాని నీవు రౌడిషీటర్‌వైతే నాకేంటి. ప్రజల్ని నరికేస్తే నాకేంటి? అసలు నువ్వెవరు?

నీ అంతరాత్మని. ఇందాకటి నుంచి చూస్తున్నాను, అందరిని నువ్వెవరని అడుగుతున్నావు, ఆ తరువాత నీవెవరైతే నాకేంటి అని అంటున్నావు. ఇది నీకు న్యాయమేనా? రాజకీయనాయకుణ్ణి ఎలక్షన్‌లో ఓటేసి ఎన్నుకున్నది నీవే. వారు తప్పు చేస్తుంటే పబ్లిగ్గా నిలదీసే అధికారం నీకుంది...అలాగే పోలీసధికార్ని, బల్దియా అధికారులని, టౌన్ ప్లానింగ్ అధికారాల్ని, డాక్టర్లని నీవే అవినీతి అధికారులుగా మారుస్తున్నావు. కాంట్రాక్టర్లని, కాలేజీ ఓనర్లని, పొలిటికల్ లీడర్స్ను, ప్రభుత్వం పెంచిపోషిస్తున్నారు. ప్రభుత్వం అంటే ఎవరు? ప్రజలేకదా. ప్రజలంటే మీరే కదా... ఇక రౌడీషీటర్లంటావా? ప్రజలందరూ కలిసి కట్టుగా రౌడీషీటర్లకి ఎదురు తిరిగి నాలుగు తగిలిస్తే వారే తోక ముడుచుకుని పారిపోతారు. ఇంతకీ అసలు నువ్వెవరు?

నీవే చెప్పావుగా, నా అంతరాత్మనని. అటువంటిది నేనెవరో తెలియదా నీకు? అయినా చెపుతాను విను. రాజకీయ నాయకులకి ఎదురు తిరిగితే వాళ్ళూరుకుంటారా ఈ దేశంలో? మనమిచ్చిన అధికారంతో మనల్నే ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తారు. ఇక పోలీసు అధికారుల్ని నిలదీస్తే.లేని పోని కేసుల్ని బనాయించి బొక్కలో తోస్తారు. బల్దియా వారిని నిలదీస్తే ఆ ఏరియాలో మరుసటి రోజు నుండి మ్యాన్ హోల్స్‌కి అసలు మూతలు వుండవు. అంతేకాక ఆ ఏరియాలో వుండే చెత్తని తీసుకెళ్ళడం కూడ మానేస్తారు. టౌన్‌ప్లానింగ్ అధికారులకి లంచాలివ్వకపోతే నీవీ జన్మలో ఇల్లు కట్టుకోలేవు. ఇక డాక్టర్ దగ్గర స్టాఫ్ లేదంటారు, మందుల్లేవంటారు. మరి వున్న ఫండ్స్ ఎక్కడికి పోతాయో మొన్నొక డాక్టర్ జంటని ఏ.సి.బి. అధికారులు పట్టుకుంటేగాని తెలియలేదు. ఇక కొన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ అయితే 'ఠాగూర్' లో చూపెట్టినట్లు చచ్చిన శవాల మీద డబ్బులేరుకుంటు కంపుకొడుతున్నాయి. రౌడీషీటర్ జోలికెళితే వాడూరుకుంటాడా? వాడు నన్ను నా నట్టింట్లోనే నిలువునా నరికిపోతాడు. వాడికి సపోర్టు రాజకీయ నాయకులు, పోలీసు అధికార్లు, బడాబాబులు వున్నప్పుడు వాడ్ని ఆపడానికి నేనెంత? అయినా ఇవన్నీ ఆపడానికి నేనెవరిని?

నేనెవరిని, నాకెందుకులే...నాకెందుకులే అని నీలాగా ప్రతివొక్కరు వూరుకోబట్టే వీళ్ళిలా చెలరేగిపోతున్నారు. పైగా ఇవన్నీ ఆపడానికి కనీస ప్రయత్నం చేయకపోగా ఎవరికి వారు సినిమాల్లోగాని రాని ఒక ''అపరిచితుడి'' గురించి ఎదురు చూస్తున్నారు. అంతేగానిసమాజాన్ని బాగుచేద్దామని ఎవ్వరికీ లేదు... అంతరాత్మ రొదపెట్టింది.

ఇదిగో ఓ అంతరాత్మా! వూరుకుంటున్నకొద్దీ నీ నస ఎక్కువైపోతుంది. పోలీసులు ఎవరైనా నీ మాటలు విన్నారంటే నక్సలైట్ అని నన్ను ఎన్ కౌంటర్ చేసేస్తారు. అందుకే నోరు మూసుకుని లోపలే ముడుచుకుని కూర్చో.

''ఏంటి! కూర్చోనంటావా? అన్యాయాన్నెదిరిస్తానంటావా? అయితే నీ కర్మ...నీవు కూడ చావు అంటూ అంతరాత్మను చంపుకుని, ఈ దేశంలో జరుగుతున్న అన్యాయాలని, అక్రమాలని, అవినీతిని, చూస్తూ ఏమీచేయలేక అన్నిటిని సహిస్తూ నిస్సహాయంగా బ్రతుకుతున్న అసలైన భారతీయుడ్ని నేను''.

★



# పసుపంటే ప్రాణం

కొందరికి కొన్ని రంగులంటే ఎంతో ఇష్టం. 'యెల్లో అంటే నాకు చచ్చేంత ఇష్టం. అందాలపోటీల్లో పాల్గొన్నప్పటి నుంచీ నాలో డ్రెస్ సెన్స్ బాగా పెరిగిపోయింది. ఏ డ్రెస్ వేసుకున్నా పదిసార్లు ఆలోచించాల్సి వస్తోంది. నా బాడీ కలర్‌కి యెల్లో కలర్ బాగా నప్పుతుంది అంటారు. ఆ కలర్ డ్రెస్ వేసుకుంటే నాకు ఆత్మవిశ్వాసం బాగా పెరుగుతుందన్పిస్తుంది. అందుకే యెల్లో కలర్‌కి నేను పట్టం కడతాను' అంటోంది మాజీ అందాలసుందరి సుస్మితాసేన్.